**ఇంజనీరింగ్** పాసయి ఉద్యోగంలో చేరే దాకా సూర్యానికి కళ్ళజోడు పెట్టుకోవాలనే ఉద్దేశ ం కలుగనేలేదు.

తన కంటిచూపు సరిగాలేదనే విషయం ఇంటర్ చదివే రోజుల్లోనే అతనికి తెలుసు. వాళ్ళ కాలేజీ ఫిజీషియన్ విద్యార్థుల నందర నూ పరీక్షిస్తున్నప్పుడు సూర్యానికి దృష్టిలోపం ఉన్నట్లు స్పష్టంచేశాడు.

సూర్యం కండ్ల విషయంలో అశ్రద్ధ చెయ్య టానికి చాలా కారణా లున్నాయి.

మొదటి బెంచీలో కూర్చుండటంచేత అత నికి లెక్చరర్ బోర్డుమీద వ్రా సేవన్నీ స్పష్టంగా నే కనిపిస్తూ ఉండటం, పుస్తకాలు చదవటాని కి ఏ విధమైన ఇబ్బందీ లేకపోవటం, 'ఇప్పటి నుంచీ నీకు నాలుగు కళ్ళొచ్చాయేమిట్రోయ్' అని స్నేహితులు గేలిచేస్తారనే అపోహ, కళ్ళజోడు పెట్టుకుంటే వికారంగా కనుపిస్తానే మోననే ఆత్మన్యూనతా భావం... అతని అశ్రద్ధ కు ముఖ్యకారణాలు.

సహజ భీరువైన సూర్యానికి తండ్రి అంటే ఇంకా భయం. ఆయనకు బదులు చెప్పటమ నే ప్రశ్నే ఉండేదికాదు. తను ధరించే దుస్తుల నుండీ, తీసుకునే ఆహారం వరకూ అన్నీ తండ్రి ఇష్టప్రకారం జరుగవల °సిందే.

సూర్యం పూర్తిగా తండ్రి ఛత్రఛాయలో పెరగటంచేత అతనికి సొంత అభిప్రాయా లంటూ ఉండేవి కావు. అలా ఉండటానికి వీలుగా అతని పెంపకం జరుగలేదు.

సూర్యం తండ్రి శర్మగారు కూడా బాగా చదువుకున్న వ్యక్తి. ఆయన స్వయంకృషివల్ల పైకి వచ్చినవాడు. ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతాల్లో ఎమ్మే పట్టాలు పుచ్చుకుని, ఆ రోజుల్లో త్రిబులెమ్మే అనిపించుకున్నవాడు.

అటువంటి విద్యాధికునికి కొడుకును పెంచటం తెలియదని ఎలా అనుకోగలం?

తన కొడుకు అరసవిల్లి సూర్యనారాయణ మూర్తి కృపవల్లనే జన్మించాడని ఆయన ప్రగాఢ విశ్వాసం. అందుకే అతనికి సూర్యనా రాయణమూర్తి అనిపేరు పెట్టుకున్నారు శర్మగారు.


సూర్యం ఆయన బహిఃప్రాణం. ఆయన కళ్ళ వెలుగు. ఆయన ఆశాజ్యోతి.

తను స్కూల్ మాస్టరు ఉద్యోగం చేస్తున్నా, తన కొడుకును మాత్రం ఎలాగైనా ఇంజనీరు ను చేయాలని ఆయన సంకల్పం. అందు కనుగుణంగా సూర్యాన్ని తగిన క్రమశిక్షణలో పెంచి తన ఆశయాన్ని సాధించారు శర్మగా రు.

అందుకే అవసర మనిపించినప్పుడు సూ ర్యంపట్ల కఠినంగా ప్రవర్తించటానికి కూడా ఆయన వెనుకాడలేదు. అలాగని సూర్యాన్ని పూర్తిగా ఖైదీలా నిర్బంధించనూ లేదు. కొయ్యకు కట్టబడిన ఆవుకు తనపరిధిలో తిర గటానికి స్వేచ్ఛ వున్నట్లే, కొన్ని నియమాలకు లోబడి తన ఇష్టప్రకారం నడచుకోవటానికి సూర్యానికి కూడా స్వేచ్ఛ ఉండేది.

ఏది, ఏమయినా శర్మగారు స్వహస్తాలతో తయారుచే °సిన స్వర్ణకమలం సూర్యం. తన ఊహల కనుగుణంగా చిత్రీకరించి ప్రాణప్ర దంగా పదిలపరచిన వర్ణచిత్రం. అందుకే తండ్రి ప్రభావం నుంచి తప్పుకుని తన దంటూ ఒక వ్యక్తిత్వం పెంచుకోవటం సూర్యా నికి సాధ్యంకాలేదు.





# ధృవతార

పుట్రేవు రాఘవేంద్ర రావు



సూర్యం మిడిల్ స్కూల్లో చదివేరోజుల్లో, ఎవరైతే "మీవాడు పండిత పుత్రుడు సుమండీ" అని వెటకారం చేసేవాళ్ళో, వాళ్ళే సూర్యం ఇంజనీ రయిన తరువాత, "ఏమో అనుకున్నాంగాని, మీవాడు నివురుగప్పిన నిప్పు సుమండీ!" అని అంటూవుంటే, శర్మగారు వాళ్ళకు అప్పుడూ, ఇప్పుడూ కూడా చిరునవ్వే సమాధానంగా ఇచ్చేవారు.

'సమత్వం యోగ ఉచ్యతే' అన్న గీతా వాక్యాన్ని జీర్ణించుకున్న శర్మగారివంటి కర్మయోగికి లోకుల ప్రశంసాభిశంసలతో పని ఏమిటి?!

ఎలక్ట్రిక్ స్తంభాలు వేసేటప్పుడు అవన్నీ ఒకేవరుసలో వుండేలా చూడటం అవసరం. సూర్యానికి మొదటి రెండు స్తంభాలే కనుపించేవిగాని, మూడవ స్తంభం నుంచీ మసకమసకగా వుండేవి. కనుక తను ఉద్యోగం సక్రమంగా నిర్వర్తించాలంటే వెంటనే కళ్ళజోడు పెట్టుకోవటం అనివార్యమని గ్రహించుకున్నాడు సూర్యం.

ఈ విషయం తెలిసిన శర్మగారు వెంటనే సూర్యాన్ని కండ్ల డాక్టరువద్దకు తీసుకువెళ్ళారు, ఇంవతవరకూ ఈ విషయం తనకు తెలియజేయనందుకు కొడుకును మందలిస్తూ.

కళ్ళజోడు పెట్టుకున్నాక సూర్యంలో గొప్ప మార్పు వచ్చింది. తను చూచే ప్రతివస్తువు ఎక్కువ కాంతివంతంగా కనిపిస్తోంది. రంగురంగుల సినీమాపోస్టర్లు, గోడలమీద అక్షరాలు, నియాన్ సైన్స్- అన్నీ ఎంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

వయసు తెచ్చిన వన్నెతో మెరసే కన్నెలు కలకలలాడుతూ కనుపించేసరికి అతని మనస్సిప్పుడు ఆనందంతో ఉరకలువేస్తోంది.

వలపు డోలికల్లో ఊగే గువ్వపిట్టల్లా ఒకరికొకరు అతుక్కుపోయి స్కూటర్లపై తిరిగే జంటలు, తలనిండా మల్లెలతో పూలరథాల్లా కదలాడే యువతులు, ఇంకా ఎన్నో మనోహర దృశ్యాలు.

తనచుట్టూ ఆవరించిన చరాచర ప్రాణికోటిని సుస్పష్టంగా చూడగలుగుతున్నందుకు అతని కెంతో సంతోషంగా ఉంది.

దుమ్ముపట్టిన అద్దంలో ముఖం చూసుకున్నాక, ఆ దుమ్ము తుడిచి చూసుకుంటే కలిగే తృప్తి.

విరిసిన ఇంద్రచాపంలా ఉన్న లోకాన్ని కనులారా చూసేసరికి అతనిలో సంచలనం కలిగింది. అతనిలో క్రొత్తశక్తి నిండింది. నిద్రాణమైన అతని భావాల్లో జాగృతి కలిగింది. అతని మనస్సు క్రొత్త చిగుళ్ళు తొడిగింది.



కళ్ళజోడు సూర్యం ముఖానికి చక్కగా అమరి అతనికి హుందాతనం తెచ్చింది. తోటివారికి తను ఏ విధంగాను తీసిపోననే ఆత్మవిశ్వాసం అతనిలో పెరిగింది.

'కళ్ళజోడుకు జోహార్లు' అనుకున్నాడు మనసులోనే సూర్యం.

ఆ నాడు సాయంత్రం డాబాపై పరుపు మీద వెల్లకిల పడుకుని ఆకాశంలో తారాడే మబ్బు కన్నెల సోయగాన్ని తిలకిస్తున్న సూర్యానికి, వాల్మీకి చెప్పిన శ్లోకం గుర్తుకొచ్చింది.

"అహో రాగవతీ సంధ్యా
జహాతి స్వయమంబరం"

వాల్మీకి ఎంత రసికుడు!

సరళ కోమలమైన పదాలలో ఎంత శృంగారం రంగరించాడు... రాగవతి అయిన సంధ్య, తాను ధరించిన అంబరాన్ని తానే స్వయంగా విడనాడుతోందట.

ఎందుకు?

లోన పొంగే తమకాన్ని పట్టలేక, తన ప్రియుడ్ని ఆకర్షించటం కోసం!

ప్రియాశ్లేషణలోనే కదా వయసు పోరు తీరేది.

సూర్యం ఉద్యోగంలో చేరిన దగ్గరనుంచి ఆడపిల్లలను కన్న ఎందరో తండ్రులు తమతో వియ్యమందమని శర్మగారికి ఒత్తిడి కలిగిస్తున్నారు.

కంటికి జోడులా మనిషికి తోడు కూడా ఉంటే జీవితం సాఫీగా సాగిపోతుంది కనుక, సూర్యానికి ఈడు జోడు కుదిరిన ఒక కన్యను ముడి వెయ్యాలని నిశ్చయించుకున్న శర్మగారు కళ్ళ పరీక్ష కోసం సెలవు పెట్టి వచ్చిన కొడుకు చేత సెలవు పొడిగింపించారు.

తత్ఫలితంగా జరిగిన పెళ్ళిచూపుల్లో నలుగు రమ్మాయిలను చూశాడు సూర్యం.

ఈ ప్రశాంత సంధ్యాసమయంలో ఒంటరిగా విశ్రాంతి తీసుకుంటున్న సూర్యం హృదయాన్ని గిలిగింతలు పెడుతూ ఆ కన్యలు నలుగురూ స్మృతిపథంలో తారసిల్లేరు.

గౌరీపట్నం కరణంగారి కూతురు కాత్యాయిని అదే ఊళ్ళో పదవ తరగతి వరకూ చదువుకుంది. కలవారింట్లో పుట్టి పాలు, పెరుగు త్రాగటం వల్ల పుష్టిగా పెరిగి, గుబురుగా కత్తిరించిన మల్లెపొదలా బొద్దుగా ఉంది.

అంతవరకూ ఏ అమ్మాయిని కాబోయే భార్య దృష్టితో చూడలేదు కనుక, ఆ దృష్టితో కాత్యాయినిని చూస్తుంటే కించిత్తు గర్వంగా ఉంది సూర్యానికి.

"మా అమ్మాయికి ఎంబ్రాయిడరీ, పెయింటింగు అంటే చాలా ఇష్టమండీ" అంటూ ఆమె అల్లిన లేసులు, కుట్టిన కర్టెన్లు, గీసిన చిత్రాలు చూపించారు కరణంగారు. అవి ఆమె కళాకౌశలానికి ప్రతీకలుగా ఉన్నాయి.

ఈ అమ్మాయినే గనుక చేసుకుంటే, ఈమెను 'గౌరి' అని పిలుస్తాడు తను అనుకున్నాడు సూర్యం.

కాత్యాయిని బొమ్మ తొలిగి, లావణ్య బొమ్మ

వచ్చింది మనోవటంమిదికి.

ఈమె కాలేజీ లెక్చరర్ కామేశ్వర్రావుగారి కూతురు. ఇంద్రనీలంలా మిలమిల మెరుస్తూ చలాకీగా ఉంది. ఆ సంవత్సరమే బి.ఎ. ఫైనల్ పరీక్ష వ్రాసింది. వీణ వాయించటం, త్యాగరాజకృతులు పాడటం ఈమె హాబీలు.

'నలుపులోకూడా అందం ఉంటుంది సుమా' అనుకున్నాడు సూర్యం ఆమెను చూశాక.

'మానస సంచరరే' అని మధురంగా పాడుతూ తన హృదయ వీణను ఎవ్వరో మీటినట్లయింది సూర్యానికి.

తరువాత మనోయవనికమీద కస్టమ్సు ఆఫీసరుగారి కూతురు అరవింద దర్శనమిచ్చింది.

మెల్లగా వెన్నెలవాకలా వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చునేసరికి ఆమెనుండి చూపులు మరల్చుకోలేకపోయాడు సూర్యం.

'ఆపాద చూడాంతం ఆకర్షణీయంగా కనుపించే లావణ్య సీమ' అనుకున్నాడు.

బిఎ సీన్సు జువాలజీ ఫైనలియర్ పరీక్ష వ్రాసింది అరవింద.

'మాఆవిడ ముచ్చటపడితే మాఅమ్మాయికి చిన్నప్పుడు భరతనాట్యం నేర్పించాం' అంటూ ఒక ఫోటో ఆల్బం చూపించాడు అరవింద తండ్రి.

వివిధ భంగిమల్లో బేబీ అరవింద తటిల్లతలా మెరుస్తోంది.

ఉద్భిన్న యౌవనఅయిన అరవింద విలాసబంధురంగా అభినయం చేస్తూ అతని కండ్లముందు రూపం కట్టుకుంది.

హృదయంలో మృదంగనాదం. చిరుమువ్వల మరుసవ్వడి.

నాట్యాన్ని చక్షుఃక్రతువని ఊరకే అనలేదు కాళిదాసు.

అరవింద యవనికాభ్యంతరంలోకి సెలవు తీసుకునేసరికి, మీనాక్షి ప్రవేశించింది.

ఈమె నీలకంఠంగారి జ్యేష్ఠపుత్రిక. తొమ్మిదవ తరగతి చదువుతుండగా పుష్పవతి కావటంతో చదువు మాన్పించి వరాన్వేషణలో పడ్డారు నీలకంఠంగారు.

"'రుక్మిణీ కల్యాణం', 'గజేంద్రమోక్షం' రాగయుక్తంగా చదవగలదు. వంటా వార్పుల్లో వాళ్ళమ్మకు ఏమీ తీసిపోదు" అని ఆమె తాతగారు ప్రశంసిస్తుంటే-

"మనవడా! నా మనవరాల్ని ఇప్పుడే బాగా చూడు. ఆ మూడుముళ్ళూ పడ్డాక నేను చూసుకోకుండా చేసుకున్నానంటే మాత్రం ఒప్పుకోం" అని ఆమె మామ్మగారు హాస్యమాడుతుండగా, తల ఎత్తిన సూర్యానికి దూరంగా స్తంభం చాటున తల వంచుకుని, ముదురాకుపచ్చ పట్టుచీరలో ఒదిగి కూర్చున్న ఆమె రూపం లీలగా గోచరించింది.

నా హృదయం స్పందించదేం? 'కులమింటి కోతి' అంటే ఈమే కాబోలు అని అనుకుంటూ ఉండగా, అంతరంగస్థలం నుంచి నిర్గమించింది మీనాక్షి.

సూర్యంలో భయాందోళనలు చోటు చేసుకున్నాయి- తన తండ్రి నీలకంఠంగారి సంబంధం ఖాయం చేస్తారేమో నని!

రేపే తను డ్యూటీలో చేరటానికి వెళ్ళిపోవాలి. ఇంతవరకూ తనతో ఈ సంబంధాల గురించి తన తండ్రి ప్రస్తావించనేలేదు. బహుశా తానే ఒక సంబంధం ఎంపిక చేస్తారేమో. తన తండ్రి స్వభావమే అంత. నియంతలా ఉంటాడు.

కనీసం తన పెళ్ళి విషయంలోనైనా తనకు స్వేచ్ఛ ఉండనవసరం లేదా?

ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్న తనకు జీవిత భాగస్వామిని గురించి ఆశలు,ఆశయాలు ఉంటాయన్నైనా ఆయనకు తెలియదా?

ఏమయినాసరే, ఈ విషయంలో తండ్రిని ప్రతిఘటించాలి అని నిశ్చయించుకున్నాడు సూర్యం.

ఇంతలో- "ఏరా సూర్యం! నీ సెలవు అయిపోయిందట. రేపే ఊరెళ్ళిపోతావని మీ అమ్మ చెప్పింది. నిజమేనా?" అంటూ శర్మగారు డాబామీదకు వచ్చారు.

తండ్రిని చూసి లేచి కూర్చుంటున్న సూర్యంతో- "పడుకో ఫరవాలేదు" అంటూ, తనుకూడా సూర్యం దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"ఎళ్ళుండి డ్యూటీలో చేరాలికదా? కనుక రేపు వెళ్ళిపోవాలి" అన్నాడు సూర్యం.

"మొన్న చూసిన నీలకంఠంగారి సంబంధం ఎలా వుంది? వారి కుటుంబ సంప్రదాయం చాలా మంచిది. పైగా వారు మనకు బాగా తెలిసినవారు." ప్రశ్నించారు శర్మగారు.

"ఆ అమ్మాయి నాకు నచ్చలేదండీ!" అన్నాడు సూర్యం, ఆమాట అనటానికి తన కంత ధైర్యం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోతూ.

గుండెలో వలపు చోటుచేసుకుంటే, మెరుపువెంట ఉరుములా ధైర్యం కూడా వెనువెంటనే వస్తుందని సూర్యానికి తెలీదు.

"ఏం?" అన్నారు శర్మగారు నవ్వుతూ.

సూర్యం సమాధానం చెప్పలేదు.

"అయితే, నీకు ఏ అమ్మాయి నచ్చినట్లు?"

"మిగిలిన ముగ్గురిలో ఎవరైనాసరే! కస్టమ్సు ఆఫీసరుగా రమ్మాయి, తరువాత లెక్చరరుగా రమ్మాయి."

శర్మగారు ముసిముసిగా నవ్వారు, అమ్మాయిలకు రాంకింగ్ కూడా ఇస్తున్న కొడుకునుచూసి.

ఇప్పుడిప్పుడే పక్షి రెక్కలు చాపుతోంది.

ఆరాత్రి భార్యతో చెప్పారు శర్మగారు- "చూశావటే! మన సూర్యానికి ఆ కస్టమ్సు ఆఫీసరుగా రమ్మాయి నచ్చిందట."

"అల్లాగా! నాకుమాత్రం ఆ లెక్చరరుగా రమ్మాయి నచ్చింది సుమండీ. బిఎ చదువుకున్నా, ఎంత అణకువ! కొంచెం నల్లగా ఉంటే మాత్రం ఏం? ముఖంలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది."

"సర్లే. చేసుకునేది వాడా, నువ్వా?"

"మరేం! బాగా చెప్పారు. వాడు ముచ్చటపడుతున్నప్పుడు ఆ కస్టమ్స్ ఆఫీసరుగా రమ్మాయినే సెటిల్ చెయ్యండి. ఆ అమ్మాయికిమాత్రం ఏం? దిదిమి దీపం పెట్టుకోవచ్చు."

తరాల అంతరాలను గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నారు శర్మగారు.

సూర్యం తిరిగి డ్యూటీలో చేరిన వారంరోజులకు తండ్రి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

"చి. సూర్యంకు ఆశీర్వచనములు!

ఉభయకుశలోపరి-

ఆరోజు సాయంత్రం నీ ముఖకవళికలు చూస్తుంటే నీ కిష్టంలేని అమ్మాయిని నీ కిచ్చి పెళ్ళిచేస్తామని నువ్వు భయపడుతున్నట్లు అనిపించింది.

'ఆత్మావై పుత్ర నామాసి' అన్నారు. అంటే తండ్రే పుత్రునిగా జన్మ ఎత్తాడని అర్థం. పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని నన్నయ ఎంత మనోజ్ఞంగా వర్ణించాడో నీవు చదివే వుంటావు.

అంతరాంతరాల్లో పుత్రప్రేమకు వసుడైపోయి ఏ తండ్రీ తన కొడుకు ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించలేడు.

తల్లిదండ్రుల హృదయాలు అగాధ జలధి సదృశాలు. పైపై పొంగే కెరటాల వంటి వారి కోపతాపాలను మాత్రమే పిల్లలు చూడగలరుగాని, ఆ అనురాగ వార్నిధియొక్క లోతుపాతుల్ని కనుక్కోవటం వారి తలకు మించిన పని.

నువ్వు కూడా ప్రాజ్ఞుడ వయావు. తల్లిదండ్రులకు, సంతానమునకుగల అనుబంధాన్ని స్వానుభవంతో త్వరలోనే తెలుసుకోగలవు.

ఇంతకూ చెప్పేదేమిటంటే... నీవు కోరినట్లు కస్టమ్సు ఆఫీసర్‌గారి సంబంధాన్ని నిశ్చయంచేశాము.

కట్నకానుకల విషయాల్లో మనకెలా కావలిస్తే అలా జరిపించగలమని ఆయన చెప్పారు.

'మీ అమ్మాయే మాఅబ్బాయికి మీరు ఇచ్చే వెలలేని కట్నం. ఇంక వేరే కట్నం ఎందుకు?' అని చెప్పాను.

వైశాఖ మాసంలో వివాహాన్ని జరిపించాలని ఆయన అభిప్రాయపడుతున్నారు. త్వరలో ముహూర్తాలు పెట్టి తెలియజేస్తాను.

మీ అమ్మకు, నాకు కూడా ఈ సంబంధం అన్నివిధాలా నచ్చింది. నీ ఇష్టమే మా ఇష్టమని గుర్తుంచుకో. నీ సుఖసంతోషాలకంటె మేం కోరేదేముంది!

నీవు విధి నిర్వహణలో సక్రమంగా ప్రవర్తిస్తూ, మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించి గొప్ప ఇంజనీరువు కావాలని ఆకాంక్షిస్తూ

నీ తండ్రి
రామశర్మ."

ఉత్తరం చదువుకున్న సూర్యానికి ఆనందాతిరేకం వల్ల కండ్లు చెమర్చాయి.

తన తండ్రిని తప్పుగా అర్థంచేసుకున్నందుకు సిగ్గుపడ్డాడు.

అరవిందను అర్ధాంగిగా ఊహించుకునేసరికి అతని శరీరం ఆపాదమస్తకం రసప్లావితమైన మధురానుభూతిలో తేలిపోయింది. ★